క్లుప్తంగా

పరీక్ష కేంద్రం సందర్శన



విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలిస్తున్న మధుసూదన్‌నాయక్

జైపూర్: మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్షలను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాన్ని సందర్శించి విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మ్యాథ్స్, జువాలజీ పరీక్ష కొనసాగగా 189మందికిగాను ముగ్గురు గైర్హాజరయ్యారు. ఆయనవెంట ఆర్డీవో వేణుగోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ వీరస్వామి ఉన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

లక్సెట్టిపేట: మండలంలోని ఎల్లారం, కొత్తూరు గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, సర్పంచ్ సొల్లు సురేష్, పీఆర్ఎఈ శృతి పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



మాట్లాడుతున్న డీటీడీవో నీలిమ

లక్సెట్టిపేట: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని డీటీడీవో నీలిమ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నీలిమ హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, పాఠశాలకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలను పలువురిని ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్ఎం బాలచందర్, హెచ్‌డబ్ల్యూవో గణేశ్, క్రీడల అధికారి బండ జీవరత్నం, సిబ్బంది గఫార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు వేడుక



పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

భీమిని: కన్నెపల్లి హైస్కూల్‌లో శుక్రవారం వీడ్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు, 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సత్యనారాయణ హాజరై మాట్లాడారు. విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో 10/10 గ్రేడ్ సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. స్కూల్ కమిటీ చైర్మన్ నెండుగూరి సంతోష్, సర్పంచ్ పుల్లూరి సురేఖ, తహసీల్దార్ రాంచందర్, ఉప సర్పంచ్ గద్దల వెంకటేశ్, నియోజకవర్గ యువజన సంఘం అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, పాఠశాల హెచ్ఎం సంజీవ్, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ పుల్లూరి రాజయ్య పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



శిబిరంలో పాల్గొన్న సభ్యులు

పాతమంచిర్యాల: లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ మంచిర్యాల సెకెండ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ వెంకటేశ్వర్‌రావు జన్మదినం సందర్భంగా జిల్లాలోని మారుతినగర్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు రక్తదానం చేయగా వారికి ప్రశంసపత్రాలు అందజేశారు. మారుతినగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తోట శ్రీనివాస్ మాట్లాడుతూ వెంకటేశ్వర్‌రావును ఆదర్శంగా తీసుకుని మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. క్లబ్ ట్రెజరర్ వంశీకృష్ణ, మారుతినగర్ లయన్స్ క్లబ్ క్యాబినెట్ మెంబర్లు శ్రీనివాస్, ఎలుకపల్లి పవన్, కోఆర్డినేటర్లు సయ్యద్, అన్వర్ హుస్సేన్, డైరెక్టర్లు అశోక్, బోనగిరి సాయి పాల్గొన్నారు.

జీపీలకు ఉత్తమ పురస్కారాలు

- అవార్డులు అందుకున్న సర్పంచులు



దండేపల్లి: పురస్కారాలు అందుకున్న సర్పంచ్‌లతో, ఎంపీపీ, అధికారులు

దండేపల్లి: మండలంలోని 14 గ్రామ పంచాయతీలు జాతీయ ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యాయి. ఎంపికైన జీపీ సర్పంచులు, కార్యదర్శులకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సన్మానించి, ప్రశంసపత్రాలు అందజేశారు. ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన వాటిలో కొండాపూర్, తానిమడుగు, తాళ్లపేట, రెబ్బనపల్లి, అల్లీపూర్, మేదరిపేట, చెల్కగూడ, చింతపల్లి, ధర్మరావుపేట, లింగాపూర్, నెల్కివెంకటాపూర్, రాజుగూడ, నంబాల, కన్నెపల్లి ఉన్నాయి. ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేశం, ఎంపీవో సత్యనారాయణ, కార్యదర్శులు ఉన్నారు.

వేమనపల్లి: వేమనపల్లి ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసి సర్పంచ్ కుబిడె మధుకర్, కార్యదర్శి సిరాజ్‌ను ఎంపీపీ స్వర్ణలత అధ్యక్షతన అవార్డుల ప్రదానం చేశారు. 9 విభాగాల్లో ప్రతిభకనబర్చినందుకు వీరికి ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికను అందజేశారు. తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో బాపురావు, వైస్ ఎంపీపీ గణపతి, పీఏసీఎస్ చైర్మన్ కిషన్‌రావు, ఏపీవో సత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి పాల్గొన్నారు.

తాండూర్: మండల పరిషత్ కార్యాలయంలో ఆయా పంచాయతీలకు సర్పంచులకు పురస్కారాల ప్రదానం చేసి, సన్మానించారు. సర్పంచులు శంకర్, దుర్గుబాయి, బక్కయ్య, నవీన్, సాగరిక, జంగుబాయి, సుజాత, శంకరమ్మ, సునీత, ఎంపీపీ ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ బానయ్య, సింగిల్ విండో చైర్మన్ దత్తుమూర్తి, ఎంపీవో సత్యనారాయణ, ఎంపీటీసీలు శంకర్, మెగిలి శంకర్ పాల్గొన్నారు.

కాసిపేట: ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డులు పొందిన ఆయా సర్పంచులకు మండల ప్రత్యేక అధికారి నీలిమ, ఎంపీపీ రోడ్డ లక్ష్మిలు అవార్డులు అందజేసి సన్మానించారు. పలు అంశాలపై మండల స్థాయిలో ఎంపిక జరగగా జిల్లా స్థాయిలో రెండు పంచాయతీలు ఎంపికయ్యాయి. ఎంపీడీవో ఆలీం, ఎంపీవో నాగరాజు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



కాసిపేట: అవార్డులతో సర్పంచులు, కార్యదర్శులు



వేమనపిల్ల: సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు



తాండూర్: పురస్కారాలు అందుకున్న సర్పంచులు

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

మందమర్రిరూరల్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పత్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఎంపీడీవో శశికళకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గత మూడు, నాలుగు నెలల వేతనాలు రాక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కామారెడ్డి జిల్లా బీబీనగర్ పంచాయతీకి చెందిన పారిశుధ్య కార్మికుడు కొంగరి బాబు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. నాయకులు శ్రీ నివాస్, నరసయ్య, రవిబాబు, వెంకటేశ్ ఉన్నారు.

కార్మికులకు యూనిఫాంలు అందజేయాలి

పాతమంచిర్యాల: మున్సిపల్ కార్మికులకు యూనిఫాంలు, చెప్పులు అందజేయాలని మున్సిపల్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమళ్ల హరికృష్ణ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ విజయ్‌కుమార్‌కు కార్మికులతో కలిసి ఆయన శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే వచ్చేనెల 3 నుంచి సమ్మె చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల మౌనదీక్ష



మేదరిపేటలో మౌనదీక్ష చేస్తున్న నాయకులు

దండేపల్లి: రాహుల్‌గాంధీ అరెస్టుకు నిరసనగా మండలంలోని మేదరిపేటలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నోటికి నల్లగుడ్డలు ధరించి, మౌనదీక్ష చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాహుల్‌గాంధీపై కేసు నమోదు చేసి జైల్లో పెట్టడం రాజకీయ కక్షసాధింపు చర్య అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని ఆరోపించారు. పార్టీ నాయకుడు త్రిమూర్తి, మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీశ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు సత్యంరావు, రాజేష్ పాల్గొన్నారు.

హాథ్‌సే హాథ్ జోడోయాత్ర

మండలంలోని మేదరిపేట, మాదాపూర్ గ్రామాల్లో పార్టీ నాయకులు శుక్రవారం హాథ్‌సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని కోరారు.

రైతులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. ఇటీవల కురిసిన వడగళ్ల వానకు మండలంలోని మాకులపేట, నాగసముద్రం, దండేపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంటలతోపాటు మామిడితోటలను శుక్రవారం సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తగిన పరిహారం అందిస్తోందని చెప్పారు. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి, నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాలన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ శ్రీనివాస్, రైతు సమితి జిల్లా కోఆర్డినేటర్ గురువయ్య, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, వైస్ ఎంపీపీ అనిల్, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఉప సర్పంచ్ భూమన్న, నాయకులు, రైతులు, వ్యవసాయ, ఉద్యానవనశాఖ తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సార్..జర పైలం!

మండలకేంద్రంలోని డిస్ట్రిబ్యూటరీ 28 కాల్వ సమీపంలో వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే దివాకర్‌రావు శుక్రవారం పరిశీలించేందుకు విచ్చేశారు. దెబ్బతిన్న పొలం డిస్ట్రిబ్యూటరీ కాల్వ అవతలి వైపు ఉండటంతో కాల్వదాటేందుకు సమీప రైతులు ఓ విద్యుత్ స్తంభాన్ని అడ్డుగా వేసి ఉంచారు. దాని గుండా కాల్వ దాటి పొలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే స్తంభం పై నడుస్తూ కాల్వ దాటే సమయంలో కార్యకర్తలు సార్...జాగ్రత్త..అంటూ,రెండువైపులా కాల్వలో దిగి ముందు జాగ్రత్తలు తీసుకున్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్

చెన్నూర్: తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని 369 మంది ఆడపడుచులకు రూ. 3,69,92,862 కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, 57 మందికి సీఎంఆర్ కింద మంజూరైన రూ.26,45,800 చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డలకు మేనమామ కట్నంగా సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందిస్తున్నారని తెలిపారు. మహిళలు స్వశక్తితో ఎదగాలనే ఉద్దేశంతో 102 గ్రామ పంచాయతీల్లో ఒక్కో భవనానికి రూ.18 లక్షలతో, 102 సమ్మక్క–సారలమ్మ భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. తొలి విడత 77 గ్రామాలను ఎంపిక చేశామన్నారు. రామకృష్ణాపూర్, మంద్రమర్రి భవనాలకు ఒక్కొటి రూ. 2 కోట్లు చొప్పున నిధులు కేటాయించామన్నారు. రూ.1.50 కోట్ల నిధులతో చెన్నూర్ భవనానికి ఇప్పటికే శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అస్గర్, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ కళ, కోటపల్లి, భీమారం, జైపూర్, మందమర్రి సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ విప్

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

బెల్లంపల్లి: రాష్ట్రంలో పత్రిక స్వేచ్ఛ, జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయిందని బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు కె.ఏమాజీ తెలిపారు. జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తుందు వల్లనే తీన్మార్ మల్లన్నను ఇతర జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపారని తెలిపారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. భేషరతుగా జర్నలిస్టులపై పెట్టిన కేసులను ఎత్తివేసి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. నాయకులు తిరుపతి, కేశవరెడ్డి, గోవర్ధన్, రాజులాల్ యాదవ్, అజ్మీరా శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, నర్సింగ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని మరిచిన కేంద్రం

జన్నారం: కేంద్రప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరిచిందని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఖలెందర్ అలీఖాన్ ఆరోపించారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను కేంద్రం పెంచుతూ ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు పాల్పడుతున్నాయని అన్నారు. జిల్లాలోని నస్పూర్‌లో ఈనెల 26న ఉమ్మడి జిల్లా సీపీఐ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూసంనేని సాంబశివరావు, కలవేణి శంకర్ హాజరవుతారని అన్నారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ మామిడి విజయ్, మంచిర్యాల పట్టణ సహాయ కార్యదర్శి చాడ మహేందర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు రాజేశ్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖలెందర్ అలీఖాన్

‘పేపర్ లీకేజీకి కేటీఆర్ బాధ్యత వహించాలి’

రామకృష్ణాపూర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ టీడీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని రామాలయం అమరవీరుల స్తూపం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ పెద్దపెల్లి పార్లమెంట్ అధ్యక్షుడు బి.సంజయ్‌కుమార్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో లక్షలాది మంది నిరుద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఈ లీకేజీ వ్యవహారానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. విద్యార్థి నాయకుడిగా చెప్పుకునే స్థానిక ఎమ్మెల్యే బాల్కసుమన్ ఇంతమంది విద్యార్థులకు అన్యాయం జరుగుతుంటే ఎందుకు స్పందించడం లేదని అన్నారు. అన్ని పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకేజీ కావటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులందరికీ స్టైఫెండ్ రూ.5వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు జలీల్, షరీఫా, సంపత్, లక్ష్మిరాజం, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుళ అంతస్తుల్లో.. లగ్జరీ అపార్ట్‌మెంట్

పాతమంచిర్యాల: పట్టణంలోని శ్రీనివాసగార్డెన్ వద్ద రక్ష హోమ్స్ పేరుతో అన్ని సౌకర్యాలతో బహుళ అంతస్తుల్లో నిర్మించిన గేటెడ్ కమ్యూనిటీ లగ్జరీ అపార్ట్‌మెంట్స్‌లో మూడు పడకల గదులు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా రక్ష హోమ్స్ ఎండీ కైలాస్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో మొదటిసారి గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌ను కాలుష్య రహితంగా, పచ్చదనం ఉట్టిపడేలా నిర్మించామన్నారు. కార్పొరేట్ స్థాయిలో ఆధునిక హంగులతో చిన్న పిల్లలకు ఆటస్థలం, పార్కు, స్విమ్మింగ్ పూల్, క్లబ్ హౌజ్‌తోపాటు పురుషులు, మహిళలకు ప్రత్యేక జిమ్, కాన్ఫరెన్స్ హాలు నిర్మించినట్లు తెలిపారు. 24 గంటల జనరేటర్ సౌకర్యం, అపార్ట్‌మెంట్ చుట్టూ సోలార్ ఫెన్సింగ్, కంపౌడ్‌వాల్, సీసీ కెమెరాలు అమర్చామని అన్నారు. మై గేట్ యాప్, విశాలమైన పార్కింగ్, ప్రకృతి రమణీయంగా నిర్మించామన్నారు. ఈస్ట్, వెస్ట్ ఫేసింగ్ 1600 చదరపు అడుగుల ప్లాట్లు కస్టమర్లకు సరసమైన ధరల్లో లభిస్తాయన్నారు. క్లియర్ టైటిల్ స్థలంలో నిర్మించిన ప్లాట్ల కొనుగోలుకు అన్ని ప్రముఖ బ్యాంకుల నుంచి లోన్లు లభిస్తాయన్నారు.



రక్ష హోమ్స్ అపార్ట్‌మెంట్స్

సంక్షిప్త వార్తలు

గ్రామాల్లో పోషణ్ పక్షోత్సవాలు

తాండూర్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలో పోషణ్ పక్షోత్సవాలను శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. మాదారం, నర్సాపూర్ పంచాయతీల్లో చిన్నారులకు అన్నప్రాసన, కేజీబీవీలో మిల్లెట్స్ గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలను నిర్వహించారు. సీడీపీఓ ఉమాదేవి, సూపర్‌వైజర్ మమత , సర్పంచ్‌లు స్వరూప, జంగుబాయి ఉన్నారు.

చెన్నూర్‌రూరల్: కిష్టంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు రక్తహీనతపై శుక్రవారం అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన బాలికలకు బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేమనపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ వద్ద విద్యార్థులకు రక్తహీనత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, ఎంఈఓ తిరుపతిరెడ్డి ఉన్నారు.

చిరుధాన్యాలతో పోషకాలు

జన్నారం: చిరుధాన్యాలు తీసుకోవడంతో పోషకాలు అందుతాయని ఐసీడీఎస్ సూపర్వైజర్ ఉమాదేవి అన్నారు. ధర్మారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్ఎం గోపాల్ పాల్గొన్నారు.

టాస్క్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా

మంచిర్యాలఅర్బన్: స్థానిక మిమ్స్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. 2020–22 వరకు డిగ్రీ పూర్తి చేసిన, తృతీయ సంవత్సరం చదువుతున్న 250 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 56 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని పిరమల్, హోటల్స్‌లో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. టాస్క్ మేనేజర్ దీపాబాలాజీ, కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రాజ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

వేమనపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో లక్ష్మయ్య అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం హరితహారం మొక్కల సంరక్షణపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఎంపీవో బాపురావు, ఏపీవో సత్యప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడాప్రాంగణాల పనులు సత్వరం పూర్తిచేయాలి

భీమారం: మద్దికల్, ఆరెపల్లిలో చేపట్టిన క్రీడా ప్రాంగణాల పనులు సత్వరం పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ సిబ్బందిని ఆదేశించారు. మద్దికల్, కొత్తపల్లిలో క్రీడా ప్రాంగణాలను శుక్రవారం సందర్శించారు. కొత్తపల్లిలో హరితహారం కింద చేపట్టిన మొక్కల నర్సరీని పరిశీలించారు. సర్పంచులు తిరుపతి, సునీత, ఓడేటి వాణి, కార్యదర్శులు ఉన్నారు.

ముగిసిన (గంగోర్) శివపార్వతుల కల్యాణం

చెన్నూర్: పట్టణంలో మర్వాడీల సంప్రదాయం ప్రకారం ప్రతిఏటా (గంగోర్) శివపార్వతుల కల్యాణం నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. పక్షం రోజుల పాటు శివపార్వతులకు పూజలు నిర్వహించి ఊరేగింపు నిర్వహిస్తారు. శుక్రవారం ముగింపు సందర్భంగా శివపార్వతుల కల్యాణాన్ని తమ తమ ఇళ్లలోనే జరుపుకున్నారు. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన మనీషా దోబా ఇళ్లలో పూజలు చేశారు.

కిడ్నీ వ్యాధులు రాకుండా జాగ్రత్త తీసుకోవాలి

మందమర్రిరూరల్: కిడ్నీ వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ ఆఫీసర్ లోక్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఏరియాలోని కేకే–ఓసీపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. మేనేజర్ కుష్వ, సంక్షేమాధికారి సత్యనారాయణ, యూనియన్ల నాయకులు ఉన్నారు.

చేపలు అమ్మకుండా చర్యలు చేపట్టాలి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో ఇతర ప్రాంతాల వారు ఇక్కడ చేపలు అమ్మకుండా చర్యలు చేపట్టాలని శుక్రవారం మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుకు వినతిపత్రం అందించారు. ఇక్కడ చేపలు అమ్మి స్థానిక మత్స్యకారుల పొట్టకొడుతున్నారని అన్నారు. మంజుల వాణి, సుగుణ, కొమురమ్మ, కల్యాణిదేవి, రమ, రంజిత, శ్రీలత, రాధ, సమ్మక్క తదితరులు ఉన్నారు.

29న తైబజార్ వేలం

చెన్నూర్: మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 29న మధ్యాహ్నం 3 గంటలకు 2023–24 సంవత్సరానికిగాను తైబజార్ బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు కమిషనర్ గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఈనెల 25 నుంచి 29 మధ్యాహ్నం 12 గంటలకు వరకు కార్యాలయ పనివేళల్లో రూ.5 వేలు దరఖాస్తు రుసుము చెల్లించి ఫారం పొందాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఇంటి, నల్లా పన్నులు, లైసెన్స్ బకాయిలు లేనట్లు సర్టిఫికెట్ జత చేయాలని తెలిపారు.

పంటల పరిశీలన

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో రైతులు సాగు చేస్తున్న వరి పంటలను ఏడీఏ జాడి బాపు శుక్రవారం పరిశీలించారు. వరికి ఆశించే చీడ, పీడలు నివారణ చర్యల గురించి తెలియజేశారు. అలాగే ఎంపిక చేసిన సర్వే నెంబర్‌లో ఏయే పంటలు సాగు చేశారో పరిశీలించారు.

పోస్టర్ ఆవిష్కరణ

లక్సెట్టిపేట: హైదరాబాద్‌లో వచ్చేనెల 4న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశం పోస్టర్‌ను స్థానిక ఐబీ ఆవరణలో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ,బీ,సీ,డీ కుల వర్గీకరణ చట్టబద్ధత కల్పించడంలో ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సమ్మయ్య, ధర్మయ్య, శ్రీనివాస్,నారాయణ, సుగుణాకర్ పాల్గొన్నారు.

28న వైహెచ్‌ఏ బెల్లంపల్లి యూనిట్ ఎన్నికలు

బెల్లంపల్లి: వైహెచ్‌ఏ బెల్లంపల్లి యూనిట్ ఎన్నికలను ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, చైర్మన్, ట్రెజరర్‌తోపాటు 11 మంది కార్యవర్గ సభ్యులకు ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన సభ్యులు ఈనెల 27వ తేదీ వరకు బెల్లంపల్లి యూత్ హాస్టల్ కార్యదర్శికి నామినేషన్‌పత్రాలు అందజేయాలని సూచించారు.

27న సీఎంపీఎఫ్ చిట్టీల పంపిణీ

మందమర్రిరూరల్: ఈనెల 27న సింగరేణి మందమర్రి ఏరియా ఉద్యోగులకు 2021–22 ఆర్థిక సంవత్సరానికి సీఎంపీఎఫ్‌కు సంబంధించిన చిట్టీలు పంపిణీ చేయనున్నట్లు ఏరియా జీఎం శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏరియాలోని గనులు, వివిధ విభాగాల ఉద్యోగులు గమనించాలని పేర్కొన్నారు.

రక్తహీనతపై అవగాహన

రామకృష్ణాపూర్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం రక్తహీనతపై అవగాహన కల్పించారు. బాలబాలికలు సమతుల పౌష్టికాహారం తీసుకోవాలని యుక్త వయస్సు నుండే తృణధాన్యాలను తీసుకోవటం ద్వారా రక్తహీనతను తగ్గించుకోవచ్చన్నారు. అలాగే శారీరక, మానసిక ఎదుగుదలలో అభివృద్ధి ఉంటుందని సూచించారు. ఐసీడీఎస్ సీడీపీవో స్వరూపరాణి, సూపర్‌వైజర్ సరిత, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రేమారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ కిట్ అందజేత

మంచిర్యాలఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం, ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీలో చదువుతున్న పదో తరగతి విద్యార్థినులకు శుక్రవారం ఆయుష్ హెల్త్ కిట్లు అందజేశారు. అదేవిధంగా రాగి లడ్డూ అందించారు. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పద్మజ, ఫార్మాసిస్టు పుష్పాంజలి, ఎంఎన్‌వో శ్రీనివాస్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న పాల్గొన్నారు.

కాసిపేట గనిపై మండల పూజ

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై శుక్రవారం దుర్గామాత ఆలయ ప్రారంభాన్ని పురస్కరించుకుని మండల పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రారంభించి 45 రోజులు అయినందున మండల పూజ, హోమం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఏరియా జీఎం శ్రీనివాస్, అధికారులు, కాసిపేట గ్రూప్ ఆఫ్ ఏజెంట్ కుర్మ రాజేందర్, మేనేజర్ రవీందర్, రక్షణాధికారి సంతోష్‌రావు, టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

నిరుద్యోగ ర్యాలీకి తరలిరావాలి

బెల్లంపల్లి: హైదరాబాద్ ధర్నా చౌక్‌లో శనివారం నిర్వహించే నిరుద్యోగ ర్యాలీ,ధర్నాకు యువకులు పెద్ద ఎత్తున తరలిరావాలని బీజేపీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కోడి రమేశ్ కోరారు. శుక్రవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ ని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అధ్యక్షన ర్యాలీ, ధర్నా జరుగుతుందని తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సబ్బని రాజనర్సు, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు దార కల్యాణి, నాయకులు నాగరాజు, సుదర్శన్‌గౌడ్, నరేశ్, రాజేష్, యుగేంధర్, రాజేష్ పాల్గొన్నారు.

కాసిపేట: నిరుద్యోగ ధర్నాను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. కాసిపేట మండలంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జి, సీబీఐ విచారణ జరిపించి, మంత్రి కేటీఆర్‌ను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రమేశ్, సంపత్ కుమార్, శంకర్, లీల, దుర్గయ్య పాల్గొన్నారు.